# ఉచిత సాయం

ఎనారై కబుర్లలో కొన్ని విషయాలకు పాఠకుల స్పందన ఎక్కువగా వుంటున్నది. వారం వారం వచ్చే ఈమైల్స్ ఆ స్పందనని స్పష్టంగా చూపు తున్నాయి. నేను వ్రాసిన మానవ సేవ అనే విషయం మీద నేను అనుకున్న దానికన్నా ఎక్కువ ఉత్తరాలు వచ్చాయి. ఉత్తరాలు వ్రాసిన వారిలో కొంత మంది వారు చేస్తున్న కార్యక్రమాల గురించి వ్రాశారు. చిన్నా పెద్దా అన్ని రకాలవారూ యధాశక్తి అలా తలో ఇటికా పెడుతుంటే మానవత్వానికి కట్టే గుడి త్వరత్వరగా తయారవుతుంది. ఇది చాల హర్షదాయకం. ఇలాటి వారు చేసే కార్యక్రమాలలో పాలుపంచుకోవటం చాల అవసరం.

నాకు ఉత్తరాలు వ్రాసిన వారిలో కొంతమందిని అర్థం చేసుకోవటం కష్టము యింది. ఎన్నో కార్యక్రమాలు చేద్దామని నిర్ణయించుకున్నాను. దానికి మీరూ, మీలాటి ఎన్నారైలు ధన సహాయం చేయండి. ఇక్కడ చాల చేస్తానని సారాంశం. కొంతమంది ఔత్సాహికులు చెక్కులు ఏ అడ్రసుకి పంపించాలో కూడా వ్రాశారు.నేను ఎవరినీ అను మానించటంలేదు. అలాఅని ఆ ఉత్తరాలు చూడగానే నేను వాళ్ళని నమ్మి డబ్బా పంపించటంలేదు. ఈ విషయం మీద నా భావాలూ ఆలోచనలూ వ్రాద్దామనే ఈ వ్యాసం.

నా అనుభవంలో చూసింది ఎలాటి సేవాకార్యక్రమాలు చేయాలన్నా ముఖ్యంగా కావలసింది నిస్వార్థంగా సేవచేయాలనుకునే మనసు. అది చేయటానికి కావలసిన కార్యదీక్ష. కమిట్‌మెంట్. మంచి పనులు చేయటానికి డబ్బులు ఇచ్చేవాళ్ళు చాలమంది వున్నారు. అది ఏమాత్రం కష్టంలేని పని అంటే ఆశ్చర్యం లేదు. ముందు పని మొదలుపెట్టి నిస్వార్థంగా చేస్తుంటే ధనసహాయం చేసేవాళ్ళు దగ్గరికి వచ్చి మరీ సహాయం చేస్తారు.

1977లో మేం త్రివేండ్రంలో వున్నప్పుడు కృష్ణా జిల్లా దివి తాలూకాలో పెద్ద ఉప్పెన వచ్చి కొన్ని వేలమంది చనిపోయారు. లక్షలమంది జనం నిరాశ్రయు లయారు. వాళ్ళందరూ పేదవాళ్ళవటంతో ఆహారమే కాక తల దాచుకోవటానికి ఇల్లూ, కట్టుకోటానికి బట్టలూ లేకుండా అల్లల్లాడుతుంటే మాతోపాటూ అక్కడి మలయాళీ మిత్రులు కూడా కదిలిపోయారు. మేమందరం త్రివేండ్రంలో ఇళ్ళ వెంబడి తిరిగి దుప్పట్లూ బట్టలూ బియ్యం దాదాపు ముఫై బస్తాల పైన సేకరించాం. మా ఇంట్లోనే పదిమందీ చేరి, అవన్నీ బస్తాల్లో సర్ది చక్కగా కుట్టి సిద్ధంచేశారు. మిత్రులు ఇండియన్ రైల్వేస్‌తో మాట్లాడి అవన్నీ దివి తాలూకాకి ఉచితంగా పంపించేటట్టు ఒప్పందం కుదుర్చుకున్నారు. అదొకటే కాదు పదివేల రూపాయల దాకా విరాళాలు

వాటంతటవే వచ్చాయి. అన్నీ రామకృష్ణా మిషన్‌కి పంపించాం. అంతేకాదు ఇద్దరు ముగ్గురు మిత్రులక్కడ శ్రమదానం చేయటానికి కూడా వెళ్ళారు. ఇది చెప్పటంలో ముఖ్యోద్దేశం మేమేదో గొప్ప పనిచేశామని కాదు. ఎన్నిరకాలుగా మనిషి ఇంకొక మనిషిని ఆదుకోవచ్చునో చూపిద్దామని. ఆశ్చర్యం వేసిందేమిటంటే రామకృష్ణామిషన్ మేం పంపించినవన్నీ అవసరమైన వారికి ఎలా ఎక్కడ ఎవరికి పంపిణీ చేసిందీ మాకు పంపించారు. తర్వాత పేపర్లలో చదివిన విషయాలు ఎవరినైనా కదిలించక మానవు. పైన చెప్పిన స్వచ్ఛంద సంస్థలేకాక ఎంతోమంది నిస్వార్థంగాచేసిన శ్రమదానం ఇది జరిగి అన్ని దశాబ్దాలైనా ఇంకా నాకలాగే గుర్తుండిపోయాయి. నీళ్ళల్లో నానిన శవాలను కుప్పలుగా పోసి తగలబెట్టటం, వాటి చేయో కాలో పట్టుకుంటే అవి వూడి రావటం, దుర్వాసనా అవన్నీ భరిస్తూ పనులు చేసిన వారున్నారే వాళ్ళ గురించి చెప్పుకోవాలి. వాళ్ళ పేర్లు చరిత్ర పుటలలో కనపడవు. ఎందుకంటే చరిత్ర ఎప్పుడూ సామాన్య మానవుల గురించి వ్రాయదు. చరిత్రకి కావలసింది హీరోలు. పనులు చేసేదీ, ప్రాణాలు పోగొట్టుకునేదీ సామాన్యులు. వాళ్ళ ఫొటోలు పేపర్లలో రావు. వాళ్ళకి ఏ ప్రభుత్వమూ పద్మశ్రీలూ, భారతరత్నలూ ఇవ్వదు. వాళ్ళు పనులు చేసిందీ, చేసేదీ కూడా ఇవేమీ ఆశించి కాదు. సంభవామి యుగేయుగే అంటారే. వాళ్ళే వీళ్ళు. రాముడూ కృష్ణుడూ చిరంజీవీ అమితాబ్ బచ్చనూ కాదు. యుగయుగాలకీ మానవత్వాన్ని నిలబెడుతున్న ఈ నిస్వార్థ స్వచ్ఛంద సేవకులు. ఒక మనిషికీ ఇంకో మనిషికీ మధ్య మానవత్వపు వారధి కట్టే ఈ మనుష్యులు.

నేను వ్రాసింది ఒక ఉదాహరణ మాత్రమే. గుజరాత్‌లో భూకంపంలాటి ప్రకృతి భీభత్సాలు వచ్చినప్పుడూ, కావాలని కల్పించుకున్న హిందూ ముస్లిం అయోధ్యా కిష్కింధకాండలు జరిగినప్పుడూ ఇలాటి సహాయ సేవా కార్యక్రమాలు ఎన్నో జరుగుతానేవున్నాయి. వుంటాయి.అలాటప్పుడు ఎంతో శ్రమదానం అవసరం అవుతుంది. ఏ ప్రభుత్వమూ, ప్రభుత్వ యంత్రాగమూ ఇలాటి పెద్దపెద్ద క్లిష్ట సమయాల్లో ఆదుకోటానికి సిద్ధంగానూ వుండదు, అంత బలగమూ వుండదు. అలాటప్పుడే స్పందించిన మనుష్యులు ముందుకి రావలసిన సమయం. పైన చెప్పిన స్వచ్ఛంద సంస్థలు కానీ, ఇతర సంస్థలు కానీ ఇలాటి సమయాల్లో ముందుకి వచ్చిన వారి సహాయం తప్పకుండా తీసుకుంటాయి. మనంతట మనం వెళ్ళి మనిష్ట ప్రకారం సహాయం చేసే బదులు వారి నిర్ణీత పథకంలో పాలుపంచుకుని సహాయం చేయటం మంచిది. మనం వేరే నిధులు వసూలు చేయాల్సిన అవసరం కూడా లేదు. దేశదేశాల్లోని అనాథ పిల్లల్ని చూసినప్పుడూ మనసు బాధగా వుంటుంది. రెండేళ్ళ క్రితం అనుకుంటాను, ఒక స్నేహితుడు ఇల్లు కొనుక్కోటానికి మా ఇంటి దగ్గరే ఇళ్ళు వెతుక్కుంటూ, నన్నూ తోడు రమ్మంటే అతనితో వెళ్ళాను. అది పెద్ద ఇల్లు. చాల బెడ్ రూములున్నాయి. మనకి ఏజెంట్ ఇల్లు చూపించేటప్పుడు ఇంట్లో ఎవ్వరూ వుండరు. అపాయింట్‌మెంట్ ఇచ్చిన టైముకి అందరూ బయటికి వెళ్ళిపోయి మనకి ప్రైవసీ ఇవ్వటం మర్యాద. నేనూ అతనూ అతని భార్యా ఇల్లు చూస్తుంటే కంటపడింది ఒక ఫొటో. కిచెన్‌లో ఆరు ఫొటోలు వరుసగా పెట్టిన ఒక ఫొటో

ప్రేం. దానిలో పిల్లలందరూ నాలుగేళ్ళనించీ పన్నెండేళ్ళ వయసు వాళ్ళు. వాళ్ళల్లో ఒక తెల్ల పిల్లవాడూ, నల్ల పిల్లవాడూ, చైనీస్ ఇలా రకరకాల పిల్లలన్నారు. ఆశ్చర్యంతో ఏజెంట్‌ని అడిగాను. 'వీళ్ళందరూ ఈ దంపతుల పిల్లలేనా' అని. ఆవిడ నవ్వి 'అవును. కాదు. జెన్నీకి పిల్లలంటే బాగా ఇష్టం. డేవిడ్‌కి అనాధలైన పిల్లలకి చేయూతనివ్వటం ఇష్టం. అందుకని ఒక పిల్లవాడ్ని కన్న తర్వాత, దేశ విదేశాలనించీ అనాధలని తెచ్చి పెంచుకుంటున్నారు. వీళ్ళందరూ దేవుడి పిల్లలు. కాకపోతే మా దగ్గర పెరుగుతున్నారు అంటుంది జెన్నీ' అంది.

ఈ వ్యాసం వ్రాస్తున్నప్పుడే ఇండొనీషియాలో భూకంపం. సునామీ అనబడే ఉప్పెన 9 దేశాల్లో 28 వేలమందిని పొట్టన పెట్టుకుందని వార్త. టీవీలో ప్రకృతిచేసిన భీభత్సం విభ్రాంతుల్ని చేసింది. ఎక్కడ చూసినా మృతదేహాలు. ఆక్రందనలూ ఆవేదనలూ. ఇంతట్లో మళ్ళీ ఇంకొక వార్త. మృతుల సంఖ్య యాభై వేలన్నారు. మర్నాటికి 11 దేశాల్లో లక్షకి పైన చనిపోయారనీ దాదాపు ఇంకొక లక్షమంది కనపడటంలేదనీ చెప్పారు. ఎక్కడ చూసినా శవాల కుప్పలు. కన్నీటితో చెబుతున్న కథలు. కన్నీరు తెప్పించే కథలు. ఇండొనీషియా మలైషియా మారిషస్ శ్రీలంక ఇండియా థాయ్‌లాండ్.. మనిషి ఏ దేశానికి చెందినవాడన్నది కాదు ముఖ్యం. చరిత్రలో ఏ ఏడొందల సంవత్సరాలకో ఒక్కసారి వచ్చే కనీవినీ ఎరుగని ఇలాటి ఉప్పెన. సృష్టి నాశనంకోసం ప్రకృతి సృష్టించిన ప్రళయం. ఎలా వచ్చిందీ, ముందే వార్నింగ్ ఇవ్వని గవర్నమెంట్ ఏం చేస్తున్నది నిద్ర పోతున్నదా, అన్నవాటికన్నా ముఖ్యమైనది మనం ఎలా సహాయం అందించగలం అని. అవతలి మనిషికి సహాయం చేద్దామనే సదుద్దేశ్యం వున్న ప్రతి మనిషికీ నడుం కట్టి ముందుకి వచ్చి, సాటివారిని ఆదుకోవటానికి ఇదొక సదవకాశం.

ఆవార్తతో పాటే టీవీలో చూపిస్తున్నారు కొంతమంది అమెరికన్లని. ఒకతను సామాన్లు సర్దుకుని ఇండియా, శ్రీలంకలకు బయల్దేరుతున్నాడు. ఇంత ఘోరం జరుగుతుంటే చూస్తూ ఎలా ఊరుకుంటాను. క్రిస్మస్ సీజన్ అంటే సాటి మనుష్యులతో కష్టాలూ సుఖాలూ పంచుకోవటం. నా కండల్లో ఇంకా బలముంది. అందుకే వెడుతున్నాను. రెడ్‌క్రాస్ వాళ్ళకి ధన సహాయం కన్నా ఇప్పుడు కావలసింది, పనులు చేయటానికి మందీమార్బలం. నేను ఒక్కడినేకాదు. నాలాటి వాళ్ళు ఇంకా కొంతమంది చేతులు కలిపారు. నాతో వస్తున్నారు. అక్కడికి రాలేని వాళ్ళు ధన సహాయం చేస్తున్నారన్నాడు.

రామాయణంలో ఉడత సాయం కథ అతనికి తెలియక పోవచ్చు. కానీ అతను మనిషిగా తను చేయగలిగిన ఆ ఉడత సాయం చేస్తున్నాడు.

0 0 0